ప్రజాశక్తి
శనివారం 15 నవంబర్ 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



సిఐఐ సమ్మిట్ ప్రారంభ వేడుకలో ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు

ఆరంభం అట్టహాసం

- సిఐఐ సమ్మిట్ ప్రారంభ వేడుకకు ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ నజీర్ తదితరులు హాజరు
- పలు సంస్థలతో నేరుగా సిఎం చంద్రబాబు ఒప్పందాలు
- ఇప్పటి వరకూ 400 ఎంఒయులు.. రూ.11.91 లక్షల కోట్ల పెట్టుబడులు
- 13,32,445 ఉద్యోగాలు దక్కుతాయని ప్రకటన
- 70 దేశాల నుంచి భాగస్వామ్య సదస్సుకు ప్రతినిధుల హాజరు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగరంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో రెండు రోజులపాటు తలపెట్టిన సిఐఐ భాగస్వామ్య సదస్సు శుక్రవారం అట్టహాసంగా ఆరంభమైంది. తొలిరోజు 25 సెషన్లు నడిచాయి. మొత్తంగా రెండు రోజుల పాటు 45 సెషన్ల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం, సిఐఐ పటిష్ట ఏర్పాట్లు చేశాయి. 70 దేశాల నుంచి ఈ సదస్సుకు పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రతినిధులు హాజరయ్యారు. వారికి ఎక్కడికక్కడ అధికారులు ఘన స్వాగతం పలికారు. పెట్టుబడుల సదస్సును ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, సిఎస్ విజయానంద్, సిఐఐ అధ్యక్షుడు రాజీవ్ మెమానీ, డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పాల్గొన్నారు. సదస్సుకు విశిష్ట అతిథులుగా పారిశ్రామికవేత్తలు కరణ్ అదాని, యూసఫ్ అలీ, బాబా కల్యాణి తదితరులు హాజరయ్యారు.

మొత్తంగా తొలి రోజు సిఎం చంద్రబాబు ప్రసంగం తీరు ఎప్పటిలాగే సంస్కరణలపై సాగింది. తాము చేపట్టే సంస్కరణల వల్ల అభివృద్ధి జరుగుతుందని చెబుతూ 2000 సంవత్సరంలో తాను ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలను సమర్థించుకున్నారు. తమ ప్రభుత్వం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధానాలను మార్చుతుందని చెప్పుకొచ్చారు. 1999లో తీసుకున్న విద్యుత్ సంస్కరణల వల్ల విద్యుత్ వ్యవస్థ ఇప్పుడు ప్రతిఫలం పొందుతోందన్నారు. ఇదంతా తన చలవేనన్నారు. విభజన తర్వాత తెలంగాణ కూడా విద్యుత్ సంస్కరణల లాభాలను అనుభవిస్తోందని చంద్రబాబు చెప్పారు. కేంద్రం నుంచి అనేక విషయాల్లో సాయం అందుతున్నా ఇంకా ఇబ్బందులున్నాయన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, ఎపి ఇమేజ్ అంతర్జాతీయ స్థాయిలో దెబ్బతిందని అన్నారు. తమ ప్రభుత్వం మిగతా 2లో..



ఎపి పెవిలియన్ స్టాల్స్ వద్ద పారిశ్రామికవేత్తల సందడి



ఎంఒయు కుదుర్చుకునేందుకు వస్తున్న లులూ కంపెనీ ప్రతినిధులు

టేబుల్ టెన్నిస్ విజేతలు బెంగాల్, తెలంగాణ

వార్త 2లో..

మెడకు ఉరితాళ్లతో.. మత్స్యకారుల నిరసన

వార్త 8లో..

ఘనంగా నరెడ్కో ప్రాపర్టీ ఫెస్ట్ ప్రారంభం

వార్త 8లో..



డిబ్బపాలెంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు

అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

సచివాలయాల వద్ద ధర్నాలు

వార్తలు 5లో..

అనధికార దత్తతలు ప్రోత్సహించొద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: అనధికార దత్తతలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించొద్దని వక్తలు పేర్కొన్నారు. చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా కెజిహెచ్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'అధికారిక దత్తతలనుప్రోత్సహిద్దాం,అనధికార దత్తతలను నివారించేందుకు అవగాహన కల్పిద్దాం' పేరిట చైల్డ్‌రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రూపొందించిన కరపత్రం ఆవిష్కరించారు. చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం సంధ్యదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను అనుసరించి మాత్రమే అధికారిక దత్తత పొందడం సులభతరమన్నారు. గొండు సీతారాం మాట్లాడుతూ బాలల హక్కులపై తమ ఫోరం తరపున ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కెజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

కాలేజీ విద్యార్థులకు సూటు..బూటు

పెట్టుబడిదారుల సదస్సులో కూర్చోబెట్టిన ప్రభుత్వం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల సదస్సులో ఇంజినీరింగ్, సైన్స్, ఐటి విద్యార్థులకు సూటు, బూటు ధరింపజేసి కూర్చొబెట్టడం శుక్రవారం చర్చనీయాంశంగా మారింది. ఎయు మైదానంలో జరుగుతున్న ఈ సదస్సుకు గీతం, దాడి, ఎంవిజిఆర్, రఘు, అనిట్స్ వంటి కళాశాల నుండి వందలాది మంది విద్యార్థులు తొలిరోజు హాజరయ్యారు. 2500 మంది ప్రతినిధులు హాజరైనట్లు చెబుతున్న ప్రభుత్వం లెక్కల్లో అనేకమంది విద్యార్థులే ఉండడం గమనార్హం. మరి కొంతమంది కూటమి పార్టీల నేతలు, క్రియాశీలక కార్యకర్తలు పెట్టుబడిదారుల అవతారం ఎత్తి ప్రతినిధులుగా హాజరయ్యారు. విశాఖలో ప్రతి సారి జరుగుతున్న సిఐఐ సమ్మిట్‌కు వచ్చిన వ్యాపారులే ఈ సమ్మిట్‌కూ రావడం గమనార్హం. విశాఖలోని వివిధ వస్త్ర దుకాణాల వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా ప్రతినిధులుగా ఈ సదస్సుకు హాజరయ్యారు. ఎంఒయులను పెద్దపెద్ద కంపెనీలే చేసుకున్నప్పటికీ ప్రతినిధుల హాజరు కోసం అనేక సంస్థల నుండి ఉద్యోగులను, వివిధ కళాశాల నుండి విద్యార్థులను ఈ సదస్సులో అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. నిజంగా వచ్చిన పెట్టుబడులతో పరిశ్రమలు స్థాపిస్తారా అన్న అనుమానం పలువురి నుంచి వ్యక్తమైంది.



సదస్సుకు హాజరైన విద్యార్థులు



ఓవరల్ ఛాంపియన్‌గా నిలిచిన బెంగాల్ జట్టు

టేబుల్ టెన్నిస్ విజేతలు బెంగాల్, తెలంగాణ

- ఘనంగా ముగిసిన 40వ అఖిల భారత పోస్టల్ క్రీడలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తపాలా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి విశాఖలోని ఎంవిపి.కాలనీ, ఎస్ 3 స్పోర్ట్స్ ఎరీనాలో జరుగుతున్న 40వ అఖిల భారత పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ శుక్రవారంతో ఘనంగా ముగిసింది. మహిళలు, పురుషుల విభాగాల్లో బెంగాల్, తెలంగాణ జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా 14 పోస్టల్ సర్కిళ్ల నుండి మొత్తం 129 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బిపి.శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా గెస్ట్ ఆఫ్ హానర్‌గా, అర్జున అవార్డు గ్రహీత (బాక్సింగ్) సీరా జయరాం ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. విశాఖపట్నం రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ విఎస్.జయశంకర్, కర్నూలు రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ డాక్టర్ వెన్నం ఉపేందర్ ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ముఖ్య అతిథి శ్రీదేవి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలేనన్నారు. గెలుపు ఓటములు సహజమని తెలిపారు.

విజేతలు వీరే..

శుక్రవారం నిర్వహించిన ఫైనల్ పోటీలలో మహిళల జట్టు విభాగంలో పశ్చిమ బెంగాల్ జట్టు విజేతగా నిలవగా, గుజరాత్ జట్టు రన్నర్‌గా నిలిచింది. అదేవిధంగా పురుషుల జట్టు విభాగంలో తెలంగాణ జట్టు విజేతగా నిలవగా తమిళనాడు జట్టు రన్నర్‌గా నిలిచింది. పురుషుల సింగిల్స్ విభాగంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆకాష్ నాథ్ విజేతగా నిలవగా తెలంగాణాకు చెందిన పవన్ కుమార్ రన్నర్‌గా నిలిచాడు. అదేవిధంగా మహిళల సింగిల్స్ పోటీలలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన పౌలామీదాస్ విజేతగా నిలవగా, తమిళనాడుకు చెందిన అభినయ రమేష్ రన్నర్‌గా నిలిచింది.

దుప్పితూరులో భూ ఆక్రమణపై చర్య తీసుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: అనకాపల్లి జిల్లా, అచ్యుతాపురం మండలం, దుప్పితూరు సర్వే నెం. 40-2లో కోట్ల విలువైన భూములను కూండ్రపు సత్య, పైలా వెంకటస్వామి అలియాస్ బాబు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వారిపై తక్షణం తగు చర్యలు తీసుకోవాలని భూ యజమానలు, బాధితులు విజయనగ రానికి చెందిన భీమరశెట్టి రమణబాబు, భీమరశెట్టి లక్ష్మి నారీమణి కోరారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ, మొత్తం 11 ఎకరాల, 23.5 సెంట్లు భూమిని, తాము కొనుగోలు చేశామని, ఈ భూమి 2004 మే 28న ఎలమంచిలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ ఇద్దరితో పాటు పెంటకోట రామజోగినాయుడు అనే వ్యక్తితో కలిపి మొత్తం ముగ్గురికి రిజిస్టర్ అయిందని నేటి వరకూ తమ సంపూర్ణ హక్కు భుక్తంలో ఉందని తెలిపారు. అయితే కూండ్రపుసత్య, పైలా వెంకటస్వామి అలియాస్ బాబు వగైరాలు దురాక్రమణ చేయుటకు ప్రయత్నించగా తాము అచ్యుతాపురం పోలీసులకు, తహశీల్దార్‌కు నెల రోజుల కిందట లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. తహసీల్దార్ నోటీసులు జారీ చేశారని, ఈ వ్యవహారంపై తమకు న్యాయం చేయాలని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రీస్కూల్స్‌ను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: బాలల దినోత్సవం పురస్కరిం చుకొని యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ప్రీస్కూల్‌ను బలోపేతం చేయాలని అంగన్‌వాడీలు కోరారు. ఈ మేరకు నక్కపల్లి సచివాలయంలో సచివాలయ ఉద్యోగులకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, అంగన్వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. 3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు అంగన్వాడి సెంటర్ లలో ఉండే విధంగా జీవో ఇవ్వాలని, ప్రీస్కూల్ పిల్లల కు తల్లికి వందనం అమలు చేయాలని, ఎఫ్ ఆర్ ఎస్ రద్దు చేయాలని కోరారు. అంగన్వాడీలకు అదనపు పనులు అప్పగించరాదని, ఆన్లైన్ వర్క్ తగ్గించాలని డిమాండ్ చేశారు.

గొలుగొండ: ప్రీ స్కూల్స్‌ను బలోపేతం చేయాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ గొలుగొండ ప్రాజెక్టు(సీఐటీయు) అధ్యక్షులు సీహెచ్. భ్రమరాంబ కోరారు. ఈ మేరకు శుక్రవారం సీహెచ్.ఎర్రవరం సచివాలయ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భ్రమరాంబ మాట్లాడుతూ, ప్రీ స్కూల్ పిల్లలకు యూనిఫారం, టై, బెల్ట్, బూట్లు ఇవ్వాలన్నారు.అంగన్వాడీలకు అదనపు పనులు అప్పగించరాదని, ఆన్‌లైన్ వర్క్ తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఆంధ్ర వైద్యకళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: ఇటీవల పూరీలో జరిగిన భారతీయ శిశు శస్త్ర చికిత్స వైద్య నిపుణుల సదస్సులో ఆంధ్ర వైద్య విద్యార్థులు ప్రతిభకు పట్టం కట్టారు. జాతీయస్థాయి క్విజ్ పోటీల్లో డాక్టర్ తేజా శ్రీనివాస్ ప్రథమస్థానంలో నిలవగా, పరిశోధన పత్ర విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో డాక్టర్ సుశ్మిత, డాక్టర్ వంశీ సూర్య నిలిచారు.

ఆరంభం అట్టహాసం



సమ్మిట్‌లో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి..) ఇంత సంక్షోభ కాలంలోనూ గడచిన 18 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను రాబట్టగలిగిందన్నారు. గూగుల్ డేటా సెంటర్ రూ.15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో రాబోతుందని తెలిపారు. ఆర్సెలార్ మిట్టల్ వంటి భారీ స్టీల్ ప్రాజెక్టు అనకాపల్లి జిల్లాకు వస్తోందన్నారు.

టూరిజందే భవిష్యత్

సిఐఐ తొలి సెషన్‌లో చంద్రబాబు ఎపి రీ ఇమేజినింగ్ పబ్లిక్ ఫైనాన్సింగ్ సదస్సులో మాట్లాడుతూ ప్రపంచంలో ఏ ఇజమూ లేదని, కేవలం టూరిజానిదే భవిష్యత్తు అని చెప్పుకొచ్చారు.

తొలిరోజు రికార్డు స్థాయిలో పెట్టుబడులు

సిఐఐ భాగస్వామ్య సదస్సు తొలిరోజు పెట్టుబడులు రికార్డు స్థాయిలో వచ్చాయి. శుక్రవారం ముఖ్యమంత్రి సమక్షంలో 41 ఒప్పందాలు, మంత్రుల సమక్షంలో మరో 324 ఒప్పందాలు జరిగాయి. మొత్తం 365 కంపెనీలు రూ.8,26,668 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఒయులు కుదుర్చుకున్నాయి. తద్వారా 12,05,174 ఉద్యోగాలు రానున్నాయని ప్రభుత్వం చెబుతోంది. శుక్రవారం వచ్చిన పెట్టుబడుల్లో అత్యధికంగా 121 వాణిజ్య పరిశ్రమల శాఖకు చెందినవే ఉన్నాయి. తర్వాత స్థానంలో ఐటిఇ అండ్ సి 95, విద్యుత్ రంగానికి చెందిన సంస్థలు 44 రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఒయులు చేసుకున్నాయి. సిఐఐ సమ్మిట్ రెండు రోజులు కలిపి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేయగా, అందరి అంచనాలను మించి ఒక్కరోజులోనే పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం చెబుతోంది. భాగస్వామ్య సదస్సు తొలిరోజు జరిగిన ఒప్పందాల కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బిసి జనార్ధనరెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సదస్సుకు ముందు రోజు చేసుకున్న ఒప్పందాలతో కలిపి 400 ఎంఒయులు.. రూ.11.91 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటిలో 13,32,445 ఉద్యోగాలు దక్కుతాయని సిఎంఒ అధికారులు శుక్రవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు.

ఆకట్టుకున్న ఎపి పెవిలియన్

భాగస్వామ్య సదస్సు-2025లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎపి పెవిలియన్‌ను రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు.

పెట్టుబడిదారులను రాష్ట్రం వైపు ఆకర్షించడమే ధ్యేయంగా దీన్ని తీర్చిదిద్దారు. దీని డిజైన్, థీమ్ రాష్ట్ర ప్రభుత్వ 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా ఉంది. ఇక్కడ వివిధ ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. క్వాంటం సిటీ, సిఆర్‌డిఎ - అమరావతి పెవిలియన్, ఇంధన శాఖ గ్రీన్ హైడ్రోజన్ హబ్, పరిశ్రమల శాఖ ఐటి అండ్ ఎలక్ట్రానిక్స్, ఎపి పర్యాటక శాఖ స్టాల్స్ కొలువుదీరాయి. వీటిని చూసేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు ఆసక్తి కనబరిచారు.

స్టీల్ రంగంలో పెట్టుబడులకు జపాన్ కంపెనీల ఆసక్తి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌లో స్టీల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ ఆసక్తిగా ఉందని ఆ దేశ రాయబారి ఓనో కేయిచ్చి తెలిపారు. సిఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై వీరిద్దరూ చర్చించారు. ఈ మేరకు స్టీల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తమ దేశంలోని పారిశ్రామికవేత్తలు ఆసక్తిగా ఉన్నారని కేయిచ్చి సిఎంకు వివరించారు. జపాన్ ఫార్మా రాజధాని కొయామా మాదిరిగానే ఏపీని ఔషధ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు జపాన్ సహకారం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. జపాన్ పనితీరు తనకు ఎంతో ఇష్టమని ఆయన తెలిపారు. సిఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో 20కి పైగా జపాన్ కంపెనీలు పాల్గొనడం పట్ల ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతిలో భవన నిర్మాణాల్లో జపాన్, సింగపూర్ ప్రతినిధులను ఆహ్వానించిన విషయాన్ని సిఎం గుర్తుచేశారు. శ్రీ సిటీలో ఇప్పటికే అనేక జపాన్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చంద్రబాబు కేయిచ్చికి తెలిపారు.


జపాన్ రాయబారితో చంద్రబాబు

గోద్రెజ్ ఆగ్రోవెట్ రూ. 70 కోట్ల పెట్టుబడికి ఎంఒయు

ఎంవిపి.కాలనీ : గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో రూ.70 కోట్ల పెట్టుబడికి సంబంధించిన నాన్-బైండింగ్ ఎంఒయూపై సంతకం చేసింది. శుక్రవారం విశాఖ వేదికగా జరిగిన సిఐఐ భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.

డెయిరీ ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ సామర్థ్యాలను పెంచడం, ఆయిల్ పామ్ రైతుల కోసం కొత్త సమాధాన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా గోద్రెజ్ అగ్రోవెట్ ఎమ్‌డి సునీల్ కటారియా మాట్లాడుతూ వ్యవసాయ-ఆర్థిక వృద్ధికి, రైతులకు సాధికారత కల్పించడానికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని తెలిపారు.

విఎంఆర్‌డిఎ కమిషనర్‌గా తేజ్‌భరత్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విఎంఆర్‌డిఎ కమిషనర్‌గా ఇటీవల ప్రభుత్వంచే నియమించబడ్డ ఎన్.తేజ్‌భరత్ శుక్రవారం విఎంఆర్‌డిఎ కార్యాలయంలోని తన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాధిపతులు ఆయనను కలిసి అభినందించారు. తదుపరి విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సంస్థ ప్రస్తుతం చేపడుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై చర్చ చేశారు.

కెజిహెచ్‌లో రేడియోథెరపీ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేజీహెచ్‌లో రేడియోథెరపి డిపార్ట్‌మెంట్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కెజిహెచ్ సిఎస్ఆర్‌బ్లాక్ నందు రేడియోథెరపి విభాగంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ ఎన్.వెంటకపతిరాజు, పూర్వ విభాగాతిపతులు డాక్టర్ ఎన్.శివశంకర్, డాక్టర్ ఎన్.సుజాతలను సన్మానించారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యా దేవి,ేండియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీల్‌చైర్ల వితరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: నాగలంక మండలం, సొర్లగొంది గ్రామానికి చెందిన కొక్కిలిగెడ్డ యూబ్ శుక్రవారం నాలుగు వీల్‌చైర్లు, రెండు బిపి ఆపరేటర్స్‌ను కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి విరాళంగా అందజేశారు. గతంలో కెజిహెచ్‌లో చికిత్స చేయించుకున్నందుకుగాను రూ.20 వేల విలువగల వీల్‌చైర్లు, బిపి ఆపరేటర్స్‌ను విరాళంగా ఆయన ఇచ్చారని వాణి తెలియజేశారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



ద్వారకా పౌరగ్రంథాలయంలో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రతి ఒక్కరూ విధిగా గ్రంథాలయాలకు వెళ్లి చదవడం అలవాటు చేసుకోఎఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్, పూర్వ విసి కెసి రెడ్డి సూచించారు. ద్వారకానగర్, పౌర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. విశాఖలో పబ్లిక్ లైబ్రరీ ఏర్పాటుకు వరహాల శెట్టి తిరుపతిరాజు కారణమని గుర్తు చేశారు. నేటి యువతకు ప్రావీణ్యతలో కొదవ లేదని, దాన్ని సక్రమమార్గంలో పెట్టేందుకు చిత్తశుద్ధితోపాటు ఇటువంటి లైబ్రరీలు దోహదపడతాయన్నారు. పౌర గ్రంథాలయం అధ్యక్షులు డిఎస్ వర్మ అధ్యక్షతన కార్యక్రమంలో రచయిత డివి సూర్యారావు, విశ్రాంత పోలీస్ అధికారి టిఎస్ఆర్ ప్రసాద్, మేడా మస్తాన్‌రెడ్డి, గ్రంథాలయ నిర్వాహకురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ మహేష్ అధ్యక్షతన గ్రంథాలయ వారోత్సవాల్లో మాజీ కౌన్సిలర్లు గంటా నూకరాజు, మైలపల్లి లక్ష్మణరావు,డి ఈశ్వర రావు, పి రాజేంద్ర ప్రసాద్ వర్మ, కె సన్యాసి నాయుడు, చిలకా రమణ తదితరులు పాల్గొన్నారు

ములగాడ : స్థానిక శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియర్ వి. అజయ్‌కుమార్ ఆధ్వర్యంలోగ్రంథాలయ వారోత్సవాల్లో ఎంఇఒ ఎల్‌బి. వెంకటరావు, చిత్రకారులు సుంకర చలపతిరావుఉపాధ్యాయులు పావని, నాగశ్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శ్యామలరావు, కార్మిక నాయకులు బి.సత్యానందరావు పాల్గొని జాతీయజెండాను ఆవిష్కరించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలను వేసి అంజలి ఘటించారు.

ఆనందపురం : స్థానిక శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సర్పంచ్ చందక లక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వారోత్సవాలను డిఎల్‌డిఒ నిర్మలాదేవి ప్రారంభించగా, నెహ్రూ చిత్రపటానికి ఎంపిటిసి కొట్యాడ రమాదేవి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లైబ్రేరియన్ బివిఎస్ అప్పారావు వారోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, ఉప సర్పంచ్ బంటుపల్లి రమణమ్మ,కొట్యాడ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు



ఆనందపురంలో జాతీయ పతాకావిష్కరణ, ప్రతిజ్ఞ

గాజువాక. : గాజువాక శాఖాగ్రంథాలయంలో ఎంఇఒ ఎం.సునీత జాతీయ పతకాన్ని ఆవిష్కరించగా, జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం కె.విజయప్రశాంతి నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు టి. శ్రీరామమూర్తి. జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, అధ్యక్షులు డాక్టర్ పి శ్రీనివాసరావు, లైబ్రేరియన్ బత్తిన సూర్యకళ, ఉపాధ్యాయులు టి. అప్పారావు పి. విశ్వేశ్వరరావు ఎస్.శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు..

పెదగంట్యాడ గ్రంథాలయంలో లైబ్రేరియన్ వెంకటరమణ ఆద్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి .కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, అద్దంకి రాఘవాచార్యులు పూలమాలవేసి నివాళులర్పించారు.

గొలుగొండ:స్థానిక శాఖా గ్రంధాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రంధాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసు, ఉపాధ్యాయులు బానోజీ, సిఆర్పి రామకృష్ణలు నెహ్రూ, సరస్వతి దేవి చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

మాడుగుల: మాడుగులలో గ్రంధాలయ అధికారి ఎడ్ల వెంకటేశ్వరరావు, కేజేపురంలో అటెండర్ శృతి ఆధ్వర్యంలోగ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గ్రామ సర్పంచులు, కళావతి, జామి రమణబాబు హాజరయ్యారు. ముందుగా నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

రోలుగుంట: రోలుగుంట గ్రంథాలయంలో స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు, సీఆర్పీ సతీష్ చాచా నెహ్రూ, సరస్వతి దేవి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరంలో కో-ఆపరేటివ్ కాలనీ శాఖా గ్రంథాలయంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి జోగేశ్వరి గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ సిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, గూనూరు మల్లు నాయుడు, కందర్ప రమణమూర్తి, సర్పంచ్ బండి నూకాలమ్మ పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంధాలయంలో గ్రంథాలయ అధికారి శిరీష ఆధ్వర్యంలో ఎంఈఓ-2 ఎంజె. రవీంద్రబాబు, గ్రామ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. నెహ్రూ చిత్రపటానికి, గాంధీ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ఎం.విజయప్రియ, వికెవి.లక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం శాఖా గ్రంథాలయంలో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.ప్రసాదరావు గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జగన్నాథం, జూనియర్ వెటర్నరీ అధికారి సిహెచ్.కరుణశ్రీ, గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు డి. నూకరత్నం పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం పద్మావతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చోడవరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే రాజు

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాలలో గ్రంథాలయ వారోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, ఉప సర్పంచ్ చదరం చిన్న, ఆళ్ల గోవిందరావు, పెతకంశెట్టి బలరామ్, లైబ్రేరియన్ పద్మావతి, హైస్కూల్ హెడ్‌మాస్టర్ ఎస్.శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి శాఖ వీధి ప్రభుత్వ గ్రేడ్-1 శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఫిజియో థెరపిస్టు డాక్టర్ పెంటకోట అపర్ణ ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బల్లా నాగభూషణం, పెంటకోట సీతారామ్ పాల్గొన్నారు.

పాయకరావుపేట : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా పతాకవిష్కరణ చేశారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.రమేష్ బాబు, టిడిపి నాయకులు చించలపు ప్రదీప్, వరహాల బాబు గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

కోటవురట్ల : గ్రంధాలయాలు విద్య భాండాగారాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. గ్రంథాలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం నెహ్రూ, సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామారావు, గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది శాఖ గ్రంథాలయంలో గ్రంధాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రంథాలయాధికారి వి.కృష్ణారావు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్ర పటానికి ఎంపియుపి స్కూల్ హెచ్ఎం సూర్యనారాయణరావు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు భానుమతి పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక శాఖా గ్రంధాలయంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి చంద్రశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.భాగ్యవతి, ఆడారి పూరీ జగన్నాథ్, బి సాంబశివరావు, గ్రంథాలయాధికారి వి.ఆనంద్ పాల్గొన్నారు.



పాయకరావుపేటలో నిర్వహిస్తున్న ర్యాలీ

17న ఐఎఫ్‌టియు ధర్నా

ప్రజాశక్తి- సీతమ్మధార. : కార్మికుల ఉపాధి, భద్రతలను హరిస్తూ, పనిగంటలను పెంచి యాజమాన్యాలకు కార్మికులను బానిసలను చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 17న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాసి లేబర్ కోడ్స్‌ను రుద్దుతుంటే, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పనిదినాన్ని 12గంటలకు పెంచుతూ చట్టసవరణ బిల్లును సెప్టెంబర్ 19న అసెంబ్లీలో ఆమోదించి,ఈనెల3న జిఒ 23 జారీ చేసిందన్నారు. 67 షెడ్యూల్ రంగాల కార్మికులకు 12ఏళ్లుగా కనీస వేతనాలు పెంచలేదన్నారు. రెగ్యులరైజేషన్, వేతన పెంపుపై ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. పెట్టుబడుల సదస్సులో ఒప్పందాలతో వచ్చే పరిశ్రమలకు లక్షల కోట్ల విలువైన భూములకు ఉచితంగా కట్టబెడుతోందని మండిపడ్డారు. గూగుల్ డేటా సెంటర్‌తో పర్యావరణానికి ముప్పుతోపాటు విద్యుత్ కొరత సమస్య ఉత్పన్నమౌతుందే తప్ప, కూటమి నేతలు చెబుతున్నట్లు ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా కార్మిక వ్యతిరేక, యాజమాన్య అనుకూల విధానాలకు వ్యతిరేకంగా 17న ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జై వెంకటేశ్వర్లు, నాయకులు బి గీత, జిల్లా ఉపాధ్యక్షులు యం. తిరుపతిరావు, బి భూషణం, జిల్లా కార్యదర్శి సి హెచ్ వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి రామకృష్ణ, సిహెచ్ చిన్నారి, కె శ్రీనివాసరావు, గుర్రప్ప, కె రామారావు, వి నారాయణ ఉన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగించే షేక్ బషీర్ (30) తాటిచెట్లపాలెంలో పనిప్రదేశంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మద్యం తాగే అలవాటు ఉండడంతో మద్యం మత్తులో భవనం పైనుంచి పడి చనిపోయినట్లు అనుమానిస్తున్నారు. షేక్ నాగూర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దత్తతపై అవగాహన

ప్రజాశక్తి-ఆనందపురం: దత్తత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మూడు సెక్టార్ల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా వర్కర్లకు దత్తతపై అవగాహన కల్పించారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ బి. మమత మాట్లాడుతూ, దత్తత ప్రక్రియ, చట్టపరమైన విధానాలు, మిషన్ వాత్సల్య పథకం ప్రయోజనాలను వివరించారు. కుటుంబ ప్రేమ, సంరక్షణ పొందాల్సిన పిల్లలకు చట్టబద్ధ దత్తత ఎంత ముఖ్యమో వెల్లడించారు.అప్‌హోల్డ్ జిల్లా కోఆర్డినేటర్ జి. డేవిడ్‌రాజు మాట్లాడుతూబాల్యవివాహాల నివారణ, ఫోక్సో చట్టం అమలు, బాలల రక్షణ వ్యవస్థల ప్రాముఖ్యతపై వివరించారు. బాల్యవివాహాలకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పివి. రత్నం, జి.శిరీష పాల్గొన్నారు.

అనాథ బాలలకు ఉచిత దంత పరీక్షలు

ప్రజాశక్తి-మధురవాడ : నగరంలోని వేపగుంటలోని గ్రేషియస్ జస్ట్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అనాథ పాఠశాలల బాలలకు శుక్రవారం గీతం దంత కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లుపై వీడియో చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. దంత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.నరసింహరావు మాట్లాడుతూ నగరంలోని పాఠశాలల్లో 'శిశు గీతం' పేరిట ఏడాది పొడవునా ప్రత్యేక దంత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు.. కార్యక్రమంలో చిన్నపిల్లల దంత వైద్య విభాగం (పెడోడాంటిక్స్) అధిపతి డాక్టర్ సి.శ్రీనివాస కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ పి.జయలక్ష్మి, డాక్టర్ బి.నళిని, డాక్టర్ పి.కోమలి, డాక్టర్ సి. హెచ్.పద్మజ, డాక్టర్ బి.శాంతి, పి.జి వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. బాలలకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కేకు కట్‌చేసి పండ్లుతోపాటు పంచిపెట్టారు.

41మందికి ఉచిత రక్త పరీక్షలు

ప్రజాశక్తి -ఆనందపురం :జాతీయ మధుమేహ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవలస కూడలి ఆర్ఎంపిల యూనియన్ జోనల్ కార్యాలయంలో ఉచిత రక్త పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. మధురవాడ మిధులాపూర్ సన్‌రైస్ హాస్పిటల్, వేములవలస రఘు లాబ్స్ సంయుక్త సహకారంతో 41 మందికి సుగర్, కొలెస్ట్రాల్, బివి వంటి పలు రక్తపరీక్షలుఉచితంగా నిర్వహించారు కార్యక్రమంలో ఆర్ఎంపిల యూనియన్ జోనల్ అధ్యక్షులు జంగం జోషి, మండల అధ్యక్షులు పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు పచ్చిపులుసు కనకారావు, కె.ఎన్.రావు, గొట్టుముక్కల రఘు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన తామర్ల

ప్రజాశక్తి- పెందుర్తి: జివిఎంసి 94వ వార్డు వైసిపి అధ్యక్షునిగా నియమితులైన తామర్ల నరసింగరావు శుక్రవారం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజుతో జగన్‌ను కలిసి, వార్డులోని పార్టీ పరిస్థితులను వివరించారు.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి నాలుగో వార్డు ఎండాల జనసేన కార్యాలయంలో శుక్రవారం వార్డు అధ్యక్షులు గరికిన అప్పారావు ఆధ్వర్యంలో పి.నాగరాజు, చిప్పాడ దుర్గతోపాటు 20 మంది వివిధ పార్టీల యువత పార్టీలో చేరారు. వారికి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ సభ్యుడు పిల్లా బాలు, శాఖరి శ్రీనుబాబు, ఒమ్మిడి రాజు, కె. ప్రసాద్, నరేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

పివిజి.రాజుకు ఘననివాళి


రాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నూకరాజు, తదితరులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : విజయనగరం సంస్థానానికి చివరి పట్టాభిషిక్తుడు, పూసపాటి వంశీయులు, ప్రజా నాయకులు డాక్టర్ పూసపాటి విజయరామ గజపతిరాజు (పివిజి రాజు) 30వ వర్ధంతిని ఆదర్శ హిందీ ప్రేమీమండలి ఆధ్వర్యంలో శుక్రవారం భీమిలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్‌స్టాండ్‌లోని పివిజి.రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ ఎంపీగా, భీమిలి ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఆంధ్ర విద్యాశాఖామంత్రిగా పివిజి రాజు సేవలను కొనియాడారు. విద్యార్థులు పాల్గొన్నారు

వేపగుంట : సింహాచలం దేవస్థానం మాజీ అనువంశిక ధర్మకర్త, డాక్టర్ పూసపాటి విజయరామ గజపతిరాజు (పివిజి.రాజు) 30వ వర్ధంతి సందర్భంగా గోశాల ఆవరణలో శుక్రవారం ఆయన చిత్రపటానికి ఆలయ ఇఒ ఎన్. సుజాత ఆదేశాల మేరకు, దేవస్థానం ఎఇఒ కె.తిరుమలేశ్వరరావు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తిరుమలేశ్వరరావు మాట్లాడుతూ, రాజవంశంలో జన్మించిన వ్యక్తికి, సామాన్య ప్రజల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి పివిజి.రాజు విశేష సేవలు చేశారన్నారు. సింహాచల దేవస్థానం పూర్వ వైభవానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఇఇ రమణ, డిఇఇ రామరాజు, పర్యవేక్షణ అధికారులు సునీల్, జివిఎస్.కె. ప్రసాద్, గోశాల, సీనియర్ సహాయకులు వాసు, మాజీ బోర్డు మెంబర్ నరసింహనాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ పెన్షనర్ల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి భీమునిపట్నం : ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ పింఛనుదారుల డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వ పింఛనుదారులసంఘం భీమిలి తాలూకా యూనిట్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో యూనిట్ కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా టి భీమారావు మూడోసారి ఎన్నికవ్వగా, కార్యదర్శిగా కె సన్యాసినాయుడు, కోశాధికారిగా పి రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షునిగా ఎం ఆనందరావులను ఎన్నుకున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ, డి.ఎ, ఇతర బకాయిలు విడుదల చేయాలని, హెల్త్ స్కీమ్ పటిష్టవంతంగా అమలు చేయాలని, రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు అనంతరం భీమారావును సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు

జిల్లా స్థాయి పద్య పోటీలు

ప్రజాశక్తి -తగరపువలస : తెలుగు సాహితీ సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాధం నాయుడు ఆధ్వర్యంలో బొగ్గు రోడ్‌లోని శ్రీకృష్ణ డిగ్రీ కళాశాలలో యోగివేమన జిల్లాస్థాయి పద్యాలు పోటీలు నిర్వహించారు. శ్రీకృష్ణ జూనియర్ కళాశాల విద్యార్థులు పి .రాజ్యలక్ష్మి, ఆర్ రమ్య, బి ఉషారాణి, బి ప్రవలిక, కె.పుణ్యవతి మంచి ప్రతిభను కనబరిచారు. విద్యార్థులతోపాటు వారికి మార్గదర్శకంగా నిలిచిన తెలుగు లెక్చరర్ టిఎల్ నాగార్జునను కళాశాల డైరెక్టర్ నర్సింగరావు,ప్రిన్సిపల్ సూర్యనారాయణ అభినందించారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రపంచ మధుమేహ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిక , ఇతర ఆరోగ్య సిబ్బంది వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అందరికీ షుగర్ పరీక్షలు నిర్వహించారు. డయాబెటిస్ అవగాహన, ప్రాముఖ్యత, నివారణ, జీవనశైలిలో మార్పులు తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.తరచుగా మూత్ర విసర్జన, కళ్ల దృష్టిలో మార్పు, బరువు తగ్గడం, బలహీనత, ఎక్కువగా దాహం, గాయాలు త్వరగా నయం కాకపోవడం తదితర లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

కష్టించి చదివితే మంచి భవిష్యత్

ఐపిఎస్ అధికారి మోకా సత్తిబాబు


విజయం కోసం పయనం పుస్తకాలు అందజేసిన సత్తిబాబు

ప్రజాశక్తి- సీతమ్మధార: సరైన ప్రణాళికతో కష్టపడి చదివితే మంచి భవిష్యత్ సాకారమౌతుందని ఐపిఎస్ అధికారి మోకా సత్తిబాబు అన్నారు. శుక్రవారం ఎండాడలోని అంబేద్కర్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (యాక్ట్స్) కాలేజీని సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. నిరుపేద కుటుంబానికి చెందిన తాను ఇంటర్‌లో కాలేజీకి 11కిలోమీటర్లు దూరం నడిచి వెళ్లేవాడిని, సెకెండియర్‌తో వచ్చిన స్కాలర్‌షిప్‌తో సైకిలు కొనుక్కుని పట్టుదలతో చదవడంతో నేడీ స్థాయికి చేరానన్నారు. తల్లిదండ్రులనే నిజమైన హీరోలుగా భావించి, వారికి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. ప్రముఖ నేత్రవైద్యనిపుణులు డాక్టర్ తెన్నేటి జయరాజు మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే నిరంతరం కొత్త విషయాలను తెలుసుకుంటూ, నిత్యవిద్యార్థిగా ఉండాలన్నారు. ఈసందర్భంగా తాను రచించిన 'విజయం కోసం పయనం' పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కళాశాల ఛైర్మన్ బి.రాజారావు, సెక్రటరీ జెవి.ప్రభాకరరావు, వైస్ ప్రెసిడెంట్ గారా సత్యనారాయణ, కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం.పద్మారావు, వైస్ ప్రిన్సిపల్ పి.అప్పలరాజు, లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ ఉప్పాడ వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మపూజిత వీల్స్ మార్ట్ మెగా సేల్‌మేళా



వీల్స్‌మార్ట్ మెగా సేల్‌మేళా


మేళాలో వాహనాల కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు

ప్రజాశక్తి- సీతమ్మధార : పద్మపూజిత వీల్స్‌మార్ట్ మెగా సేల్‌మేళాకు మంచి స్పందన వస్తోంది. ఈనెల 13న ప్రారంభమై, 16 వరకు కొనసాగే మేళాలో 300 బైక్‌లు, 20 కార్లు ఒకేచోట అమ్మకానికి పెట్టినట్లు సంస్థ ఛైర్మన్ బసవరాజు తెలిపారు. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడుతూ, తమ సంస్థ కస్టమర్లకు నాణ్యమైన సదుపాయాలతో కూడిన వాహనాలను అతితక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. టూ వీలర్ కొనుగోలుదారునికి హెల్మెట్, కారు కొనుగోలుదారునికి హాట్ వాటర్ బాటిల్‌ను ఉచితంగా అందజేస్తామన్నారు. మెగా సేల్‌మేళా కొనసాగే నాలుగు రోజుల్లో ప్రతిరోజూ లక్కీడిప్ ద్వారా ముగ్గురిని ఎంపిక చేసి ప్రథమ బహుమతిగా రూ. ఐదు వేలు, ద్వితీయ బహుమతిగా రూ.మూడు వేలు, తృతీయ బహుమతిగా రూ.రెండు వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. కొత్త వాహనాల కొనుగోలుదారునికి షోరూం ధర కంటే రూ.ఐదువేలు తక్కువ ధరకు వాహనాన్ని రాయితీపై అందజేస్తామన్నారు. నగర ప్రజలతోపాటు వినియోగ దారులు మేళాను సందర్శించి, సద్వినియోగం చేసుకోవాలని విజయవంతం చేయాలని బసవరాజు కోరారు.

నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా అప్పలనాయుడు

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్‌గా తూర్పు నియోజకవర్గం 10వ వార్డు టిడిపి సీనియర్ నాయకులు, ప్రస్తుత వార్డు అధ్యక్షులు గాడు అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ పార్టీకి తాను చేసిన సేవలు గుర్తించి గురుతర బాధ్యతను అపప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ధన్యవాదాలు తెలిపారు. టిడిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

టిడిపి కమిటీల ప్రమాణ స్వీకారం


3వ వార్డు టిడిపి అధ్యక్షుడు నరేంద్రకుమార్

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు టిడిపి అధ్యక్షునిగా గొలగాని నరేంద్రకుమార్‌ను పార్టీ అధిష్టానం నియమించింది.ఉపాధ్యక్షులుగా వాడమొదల సత్యా రావు, ప్రధాన కార్యదర్శి గా కనకల అప్పలనాయుడు,కోశాధికారిగా కంచర్ల కామేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జె.మురళి, కార్యనిర్వాహక కార్యదర్శులుగాఎన్ చిన్న రమణ, ఆర్ వెంకట రమణ, కార్యదర్శులుగా ఎ నూకరాజు, వియ్యపు పోతురాజు, ఎస్ మహేష్‌రెడ్డి నియమితులయ్యారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సింహాచలంలో కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకారంచేసింది.

మధురవాడ : జివిఎంసి ఆరోవార్డు టిడిపి అధ్యక్షునిగా కెవిఆర్ కేటరింగ్ అధినేత గరే గురునాథ్ నియమితులయ్యారు. వార్డు కొత్తకమిటీలో ఉపాధ్యక్షుడిగా వరుపుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా లొడగల జానకి రామ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బన్నురావురి ప్రసాదరావు, పోతిన శ్రీనివాస రావు,నొడగల రామశేఖర్, కార్యదర్శులుగా తిరుమలరాజు వర్మ, అలాబని సూరిబాబు, గిడిజాల పార్వతీశం, కోశాధికారిగా కొరగంజి సూరిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురునాథ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా, యువనేత రవితేజ చిక్కాల విజయబాబు అడుగు జాడల్లో నడుస్తూ,పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

సీతమ్మధార : దక్షిణ నియోజకవర్గం టిడిపి వార్డు అధ్యక్షులుగా నియమితులైన 29వ వార్డు అధ్యక్షుడు కండిపల్లి సతీష్‌కుమార్ 31వ వార్డు అధ్యక్షుడు బత్తిన నవీన్ కుమార్‌లను గీత కార్మిక, యాత సమైక్య సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు అత్తిలి శంకరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. సిఎం చంద్రబాబు, లోకేష్, పల్లా శ్రీనివాస్, ఎంపీ శ్రీభరత్, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, ఎన్‌టిఆర్ వైద్యసేవ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్‌లకు కొత్త కమిటీ ధన్యవాదాలు తెలిపింది. సొసైటీ ప్రెసిడెంట్. మేడ శెట్టి రమణ, యర్ర అప్పారావు, నాగల చిన్నారావు, బండా అప్పారావు, సిమ్మ చిరంజీవి, పోలవరపు శ్రీను వాసు, దొడ్డి రాజు, గోవింద్, మేడిశెట్టి కనకరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నర్సీపట్నం: నర్సీపట్నం నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో నర్సీపట్నం టౌన్ పార్టీ అధ్యక్షులతో పాటు నాలుగు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులను, కార్యదర్శులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షులుగా చింతకాయల రాజేష్ ఎన్నికయ్యారు. నర్సీపట్నం మండల అధ్యక్షులుగా అప్పలనాయుడు, మాకవరపాలెంకు ఆర్నె పాత్రుడు, నాతవరంకు నందిపల్లి వెంకటరమణ, గొలుగొండ మండల అధ్యక్షులుగా తారక వేణుగోపాల్ తో పాటు ప్రధాన కార్యదర్శి తో 1800 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పార్టీ అభివృద్ధికి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు పాల్గొన్నారు.


రాజేష్‌ను సత్కరిస్తున్న టిడిపి శ్రేణులు

ఐదు వేల కాలేయ మార్పిడి ఆపరేషన్లతో
అపోలో అరుదైన ఘనత

ప్రజాశక్తి - ఆరిలోవ : ఐదు వేలు కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా భారతదేశంలోనే ప్రత్యేక మైలురాయిని చేరుకున్న మొదటి ఆసుపత్రిగా అపోలో నిలిచిందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి అన్నారు. పాతికేళ్లుగా . నిరంతరం సాగించిన క్లినికల్ ఆవిష్కరణలు, రోగుల సంరక్షణ, 50కి పైగా దేశాల నుంచి తీవ్రమైన కాలేయ వ్యాధితో బాధపడుతూ వచ్చిన రోగులలో ఆశను నింపాలనే లక్ష్యంతో చేసిన కృషికి తొలి అడుగు అన్నారు. అపోలో కాలేయ మార్పిడి కార్యక్రమం ద్వారా రెండు దశాబ్దాలుగా ఎబిఒ అనుకూలత లేని, సంయుక్త కాలేయ, మూత్రపిండాల మార్పిడి వంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలను నిర్వహణలో అపోలోలో ముందుందన్నారు. వయోజనులకే కాకుండా కేవలం 4 నెలల వయస్సు, మూడున్నర కిలోల బరువున్న శిశువులకు కూడా విజయవంతంగా చికిత్స అందిస్తుందన్నారు.

పురుషుల ప్రొస్టేట్ గ్రంధి సమస్యలకు
నేటి నుంచి ఉచిత వైద్యం



మాట్లాడుతున్న డాక్టర్ ప్రతిమాదేవి

ప్రజాశక్తి- తగరపువలస :స్థానిక అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో అంతర్జాతీయ పురుషుల ఆరోగ్య అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని ది ఈనెల 15 నుంచి 20 వరకు ప్రోస్టేట్ గ్రంధి సమస్యలపై ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వైద్య సహాయం అందిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ప్రతిమ దేవి చెప్పారు. పురుషులకు మూత్ర విసర్జన సమయంలో మంటగా అనిపించినా, అనేకసార్లు మూత్రపోసినా, ఆపుకోలేని పరిస్థితిఉన్నా, తెలియకుండానే మూత్రం అయిపోతున్నా ఆయా సమస్యలకు వారం రోజులపాటు .ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి 1గంట వరకు ఆసుపత్రిలో రోగ నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన వైద్య సహాయం అందిస్తామనారు. అనిల్‌నీరుకొండ ఆసుపత్రి కల్పించే ఉచిత శిబిరాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. యురాలజిస్ట్ డాక్టర్.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రోస్టేట్ గ్రంధి సమస్యలను గుర్తించి సరైన వైద్యం పొందకుంటే కేన్సర్‌కు కారణమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డాక్టర్ ప్రీతం. చెంచురెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

సచివాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి-కశింకోట : ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లోనే చేర్పించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని కోరుతూ శుక్రవారం మండలంలోని ఎఎస్.పేట సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సచివాలయం పరిధిలోని 6 అంగన్వాడీ కేంద్రాల వర్కర్స్, ఆయాలు, లబ్ధిదారులు, ప్రీ స్కూల్ పిల్లలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు మాట్లాడుతూ ప్రీస్కూల్ బలోపేతం చేయాలని, ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని కోరారు. ప్రీ స్కూల్ నిర్వహణకు సమయం కేటాయించే విధంగా ఆన్లైన్ పని తగ్గించాలని, మెనూ క్వాంటిటీ పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా పరిష్కరించాలని, లేకుంటే డిసెంబర్ 12వ తేదీ కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు ఆర్.దేవి, పద్మ, టి.వెంకటలక్ష్మి , సుబ్బలక్ష్మి, వి.పద్మ పాల్గొన్నారు.


అనకాపల్లి : వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు, చిన్నారులు

అనకాపల్లి : అంగన్వాడీ సెంటర్లను ప్రీస్కూల్ పిల్లలతో బలోపేతం చేయాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యాన మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలు అంగన్వాడి కేంద్రాల్లో ఉండే విధంగా జీవో జారీ చేయాలని కోరారు.

అచ్యుతాపురం : అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని దిబ్బపాలెం సచివాలయం వద్ద శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ అంగన్వాడీ రంగానికి బడ్జెట్ పెంచాలని, అంగన్వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలో విలీనం చేయడం ఆపాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, మండల కన్వీనర్ కె.సోము నాయుడు, అంగన్వాడి యూనియన్ ప్రతినిధులు వరలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.


కశింకోట : చిన్నారులతో కలిసి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు

చిన్నారిపై అనుచిత ప్రవర్తన పట్ల ఐద్వా నిరసన

ప్రజాశక్తి-కశింకోట : పరవాడ మండలంలో పెంటసీమ బోనంగి గ్రామంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ చైర్మన్ పి.సూర్యనారాయణ రెడ్డి చిన్నారిపై చేసిన అనుచిత ప్రవర్తనపై సమగ్ర విచారణ తక్షణమే జరిపించి కఠిన చర్యలు చేపట్టాలని, బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యాన మహిళలు శుక్రవారం కశింకోటలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి మాట్లాడుతూ మహిళా చట్టాలు సమగ్రంగా అమలు కావకపోవడం వలన ఇటువంటి నేరాలు, ఘోరాలు ప్రతి క్షణం జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు ఎం.తారక, ఎం.సత్యవతి, కె.లక్ష్మి, కె.అప్పల నర్స, టి.నూకరత్నం, టి.భవాని, కె. ధార్మిక తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రవాణాధికారి జి.మనోహర్ తెలిపారు. నైపుణ్యంతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశ్యమని పేర్కొన్నారు. 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున మంజూరు చేసేందుకు నిర్ణయించడం జరిగిందని డీటీఓ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు డీపీఆర్ నకలను, ఇతర అటాచ్మెంట్లను స్థానిక జిల్లా రవాణాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఆసక్తి గల సంస్థ ఎన్జీఓ, ట్రస్ట్, కోపరేటివ్ సొసైటీ, తయారీదారుడు ఫర్మ్ అయి ఉండాలన్నారు. ఎన్జీఓ అయితే తప్పనిసరిగా దర్పం పోర్టల్ లో రిజిస్టరయి ఉండాలని సూచంచారు. గత మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్స్, టర్న్ ఓవర్ సర్టిఫికెట్స్ అందించాలని కోరారు. సొంతంగా లేదా కనీసం పది సంవత్సరాల లీజు కలిగిన రెండు ఎకరాల స్థలం, సిమ్యూలేటర్, ట్రైనింగ్ వాహనాలు, వర్క్ షాప్, క్లాస్ రూమ్స్, ఇంటర్నెట్ తదితర సదుపాయాలు ఉండాలని సూచించారు. మరిన్ని వివరాలకు డీ.టీ.ఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

తాగునీటి బోరు ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి లంకలపాలెం శివారు గొడ్డుపేటలో కొత్తగా తాగునీటి బోరు ఏర్పాటుకు శుక్రవారం ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వాటర్ సప్లై విభాగ అధికారులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

బ్యాంకు ఆఫ్ బరోడా రూ.12.6 లక్షల రుణాలు

ప్రజాశక్తి -యలమంచిలి : పిఎం స్వానిధి ద్వారా యలమంచిలి బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా మెప్మా స్రీట్ వెండర్స్ లబ్ధిదారులకు శుక్రవారం రూ.12.6 లక్షల రుణాలు అందించినట్లు మెప్మా సిఎంఎం పద్మావతి తెలిపారు. తొలుత రూ.10వేలు, ఆ తర్వాత రూ.15 వేలు , అనంతరం రూ.25వేలు చొప్పున స్ట్రీట్ వెండర్స్‌కు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు మాట్లాడుతూ స్ట్రీట్ వెండర్స్ ఆధునిక సాధనాలు ఉపయోగించి గరిష్ట లబ్ధి పొందాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందని, వెండర్స్ ఎవ్వరూ ప్లాస్టిక్ సంచులు వినియోగించకూడదని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు ఆఫ్ బరోడా మేనేజర్ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ బిందుకుమీర్, మెప్మా డిఎంసి వరలలక్ష్మి, సిఓలు ఆర్‌లు పాల్గొన్నారు.



రుణాలు అందజేస్తున్న బ్యాంకు ఆఫ్ బరోడా అధికారులు

ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు


అనకాపల్లిలో నెహ్రూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భారత తొలి ప్రధాని నెహ్రూ జయంతి వేడుకలను శుక్రవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు పాల్గొన్నారు. పిల్లలకు స్వీట్స్ పంపిణీ చేశారు. అనేక పరిశ్రమలను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి నెహ్రూ అని కొనియాడారు. నాయకులు సవరవిల్లి రామకృష్ణ, రెడ్డి మధుసూదన్ పాల్గొన్నారు. నెహ్రూ ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు కోరారు. శుక్రవారం బీచ్ రోడ్డులోని బాలవికాస ఫౌండేషన్ బ్రిడ్జి స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సేవకులు మామిడి వీరభద్రరావు, ఇమంది ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

అనకాపల్లి : దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ జంక్షన్లో శుక్రవారం నిర్వహించారు. నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవ భారత రూపశిల్పి నెహ్రూ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు, కాళ్ళ సత్యనారాయణ, తుట్టా రమణ, సేనాపతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జవహర్ లాల్ నెహ్రా జయంతి సిపిఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పోలమరశెట్టి ఆనందరావు, అంగన్వాడీ టీచర్ రామలక్ష్మి, ఆళ్ల సూరిబాబు, కాండ్రేగుల రాము, మల్ల సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

నెహ్రూ విధానాలపై సదస్సు

అనకాపల్లి : స్థానిక సిపిఐ శ్రామిక సదనంలో శుక్రవారం నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా ఇస్కప్ అనకాపల్లి జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో దేశాభివద్ధికి నెహ్రూ అనుసరించిన విధానాలు నాడు-నేడు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు, కవులు, కళాకారులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఇస్కఫ్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు ఎంఎ మాధవరావు, విల్లూరి పైడారావు, బొడ్డేడ అప్పారావు, దొరబాబు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సిపిఎం నేత మహేశ్వరరావు తదితరులు

బాలికలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-కశింకోట : బాలికలకు రక్షణ కల్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి అన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యాన తేగాడ కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు వారి హక్కులు, చట్టాలను సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. బాలికలకు ఏదైనా అత్యవసమైతే 1098, 112, 181, 100 ఉచిత హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ కోఆర్డినేటర్ మేరీ సువార్త, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఝాన్సీ రాణి, జిల్లా బాలల సంరక్షణ విభాగ రక్షణ అధికారి కెఎల్. మనోహర్, లీగర్ ఆఫీసర్ రమాదేవి, కౌన్సిలర్ భాను, సామాజిక కార్యకర్త రూప పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని భీమవరం, తిమ్మాపురం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు అమలు జరుగుతున్న తీరును ఎంపిడిఓ పి.మీనా కుమారి శుక్రవారం పరిశీలించారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. తిమ్మాపురం సర్పంచ్ కర్రి అప్పారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాల, బాలికల రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు పరవాడ ఐకాన్ స్పోర్ట్స్ హబ్‌లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. డివిఇఒ ఉమారాణి, బి.శంకర్, ఆర్ఐఓపి మురళీధర్తో, మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ నెల 16వరకు ఈ పోటీలు జరగనున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు హాజరైనట్లు ఎస్‌జిఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వివి.పుష్పలత తెలిపారు. పోటీల్లో కీలక పాత్ర పోషించిన రాంబాబు, తరుణ్‌లను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వియ్యపు చిన్న, గొర్లివానిపాలెం సర్పంచ్ జి. గోపి, సంస్కృతి స్కూల్ స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణాలు కూల్చివేత

ప్రజాశక్తి - యలమంచిలి : మునిసిపాలిటీ పరిధిలో అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న భవనాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి కోసూరు పద్మ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కట్టుపాలెం వార్డులోని నారాయణపురం పరిధిలో సర్వే నెంబర్ 196లో బొడ్డేడ గణేశ్ నిర్మిస్తున్న 102 స్కేర్ మీటర్ల పరిధిలో నిర్మిస్తున్న షెడ్డును శుక్రవారం కూల్చివేసినట్లు తెలిపారు. పురపాలక సంఘంలో 2025 ఆగస్టు 31లోపు నిర్మించిన అనుమతుల్లేని భవనాలు క్రమబద్ధీకరించుకొనే అవకాశం రాష్ట్ర ప్రభుత్వ కల్పించిందని, ఆ తర్వాత అనధికారికంగా నిర్మించిన, నిర్మిస్తున్న భవనాలను కూల్చివేయనున్నట్లు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు.

ఎంఇఒ-1గా సూర్యప్రకాష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-యలమంచిలి : మండల విద్యాశాఖాధికారి-1గా సుసర్ల సూర్యప్రకాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే ఎంఇఓ-1గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు కొనసాగడానికి ఆసక్తి చూపకపోవడంతో సూర్యప్రకాష్‌ను ప్రమోషన్‌పై ఎంఇఓగా నియమిమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గత 24 ఏళ్లుగా స్కూల్ అసిస్టెంటుగా యలమంచిలి మండలంలోనే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన సూర్యప్రకాష్ ఎంఇఓగా నియమితులైన సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. యలమంచిలి కొత్తపేట హైస్కూల్లో ఉపాధ్యాయునిగా సూర్యప్రకాశ్ గురువారం రిలీవ్ అయ్యారు. పలువురు ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.


ఎంఇఒ సూర్యప్రకాష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీచర్లు

విద్యార్థి మరణంపై దర్యాప్తు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేటలోని డావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్లో గురువారం విద్యార్థి మృతిపై విచారణ కొనసాగుతుందని ఎస్‌పి పి.ప్రసాదరావు తెలిపారు. విద్యార్థి తల్లి జనపరెడ్డి నాగ శ్రీలత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై పి.ప్రసాదరావు తెలిపిన వివరాలు ప్రకారం... ఎలమంచిలి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన జనపరెడ్డి శ్రీనివాసరావు, నాగ శ్రీలత కుమారుడు మోక్షిత సందీప్ (8) డావెన్సీ స్కూల్ ఒకటో తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం స్కూల్‌కు వెళ్లిన సందీప్ సాయంత్రం ఇంటికి రాలేదు. స్కూలు యాజమాన్యం, డ్రైవర్, టీచర్లు, ప్రిన్సిపాల్‌తో మాట్లాడితే బస్సు ఎక్కించలేదని చెప్పారు. స్కూల్లో వెతకగా, స్విమ్మింగ్ పూల్ వద్ద గోడకు ఆనించి టార్పాలిన్‌తో కప్పి ఉంచిన బాలుడి శవాన్ని కనుగొన్నారు. బాధితులు స్కూలు ఆవరణలో ఉండగానే యాజమాన్యం సూచనతో ఇద్దరు వ్యక్తులు వచ్చి సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌ను తీసుకెళ్లిపోయారు. స్విమ్మింగ్ పూల్‌లో నీటిమట్టం తగ్గించడానికి కరెంటు తీసివేశారు. ఘటనానంతరం తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం, మృతదేహాన్ని కూడా చూడకపోవడం వంటి నిర్లక్ష్యం జరిగింది. స్కూల్ యాజమాన్యం, స్విమ్మింగ్ పూల్ ఇన్చార్జ్, టీచర్, బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యతోనే ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యార్థి తల్లి నాగశ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఎలమంచిలి సిఐ ధనుంజయరావు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బంధువుల ఆందోళన

మునగపాక : డావెన్సీ స్కూల్లో గురువారం



పోలీసులతో మాట్లాడుతున్న టిడిపి నేత ప్రగడ

విద్యార్థి మోక్షిత్ సందీప్ మృతి చెందిన సంఘటనపై బంధువులు శుక్రవారం కూడా ఆందోళన కొనసాగించారు. వైసిపి నాయకులు కరణం ధర్మశ్రీ, బొడ్డేటి ప్రసాద్, టిడిపి నాయకులు ప్రగడ నాగేశ్వరరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. డిఎస్‌పిలు శ్రావణి, విష్ణు స్వరూప్, సిఐలు ధనుంజయరావు, స్వామి నాయుడు, స్థానిక ఎస్సై పి ప్రసాదరావుతో పాటు పలువురు పోలీసు అధికారులు పరిస్థితిని సమీక్షించారు. ఎట్టకేలకు బాధిత కుటుంబానికి సర్ది చెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి : డావిన్స్ స్కూల్ విద్యార్థి మృతికి కారణమైన యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, పిడిఎస్‌ఒ జిల్లా అధ్యక్షుడు భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్కూల్లో ఈత కొలనులో పడి విద్యార్థి మృతి చెందితే పాఠశాల నిర్వాహకులు కనీసం తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచి ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోవడం దుర్మార్గమన్నారు. ఇలాంటి పాఠశాలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.



జెండా ఊపుతున్న తహశీల్దారు, ఎంపిడిఒ తదితరులు

డ్రగ్ రహిత సమాజం నిర్మిద్దాం

ప్రజాశక్తి-కోటవురట్ల : డ్రగ్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ నడుంబిగించాలని తహసిల్దార్ తిరుమల బాబు, ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. డ్రగ్ నిర్మూలనపై విజయవాడ నుంచి ఇచ్చాపురం వరకు చేపట్టిన అవగాహన సైకిల్ ర్యాలీ శుక్రవారం మండల కేంద్రానికి చేరింది. దానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై రమేష్, కార్యదర్శి రఘురాం, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

రోడ్లు బాగు చేయాలని నిరాహార దీక్ష

ప్రజాశక్తి-చోడవరం : రోడ్లు బాగు చేయాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో చోడవరం తహశీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వెంకన్నపాలెం, చోడవరం, మాడుగుల, రోలుగుంట, పాడేరు వెళ్లే రహదారుల్లో పెద్ద గోతులు ఏర్పడి ప్రయాణానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు వేసేంత దీక్షలు ఆపేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆప్ నాయకులు కొణతాల హరినాథ్ బాబు, వేగి మహాలక్ష్మి నాయుడు, పివిఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-యస్.రాయవరం : మేజర్ పంచాయతీ తిమ్మాపురం శివారు కొనవానిపాలెం గ్రామ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు కూటమి నాయకులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో శ్మశాన వాటికను అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీపీ వెంకటలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, జడ్పిటిసి కాకర దేవి, కూటమి నాయకులు కోన అప్పలరాజు, అమలకంటి అబద్ధం, కొనతాల శ్రీనివాస్, బాబూరావు, అల్లు నరసింహమూర్తి, గుర్రం రామకృష్ణ పాల్గొన్నారు.

పందుల బెడదను నివారించాలి

ప్రజాశక్తి-కశింకోట : కసింకోటలో పందులు బెడదను నివారించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డి.వరలక్ష్మి, ప్రజా సంఘాల నాయకుడు దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు పందులు సంచరిస్తున్న కశింకోటలోని పూసర్ల వీధి, భవాని నగర్ ప్రాంతంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పందులు ఇళ్లలోకి చొరబడి పాడు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత సీజన్‌లో మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలతో, కీళ్ల నొప్పులతో ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. ఈ సమయంలో ఈ పందుల వల్ల మెదడు వాపు వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పోరాటం ఉధృతం

ప్రజాశక్తి-పరవాడ : ప్రభుత్వ వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే, వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని గొర్లెవానిపాలెం గ్రామంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహించారు. ముందుగా గ్రామ సర్పంచ్ గొర్ల గోపి అమ్మల తొలి సంతకం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గొర్లి శ్రీనివాస్, పైల అప్పారావు, జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బుస అప్పలరాజు, కోన రామారావు, బొద్దపల్లి హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

టిడిపి గ్రీవెన్స్‌లో సమస్యలపై అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

ప్రజాశక్తి-యలమంచిలి : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో పలు సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. మాజీ ఎంపీ, టిడిపి సీనియర్ నేత పప్పల చలపతిరావు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి అధికారులకు రిఫర్ చేశారు. అనంతరం క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొండా జగన్నాథం, మామిడి శివ అప్పారావు, రాజాన రమేష్‌కుమార్, గొర్లె శివనారాయణ, పెంటకోట విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : అనకాపల్లి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో టిడిపి శ్రేణులు, ప్రజల నుండి రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ వినతులు స్వీకరించారు. భూమి పాస్ పుస్తకాల కోసం మండలానికి చెందిన రైతులు ఫిర్యాదు చేయగా, వీటిపై పీలా తహశీల్దారుతో మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, టిడిపి కశింకోట, అనకాపల్లి మండలాల అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు, కర్రి వెంకట సన్యాసి నాయుడు, బొలిశెట్టి శ్రీనివాసరావు, పోలారపు త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణ మృతి పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : టిడిపి బీసీ సెల్ మండల శాఖ అధ్యక్షులు కర్రి వెంకటరమణ అకాల మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో వెంకటరమణ శుక్రవారం ఉదయం చనిపోయారు. ఆయన మృతదేహం వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆడారి మంజు, పి.తులసి రాము, సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, కె.రామ సదాశివరావు, కనుమ నాయుడు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన పది లక్షల రూపాయలకు సంబంధించిన చెక్కును మండలంలో కాజ పాలెం గ్రామానికి చెందిన అప్పికొండ నాయుడుకు శుక్రవారం మాజీ ఎంపీ పప్పల చలపతిరావు చేతుల మీదుగా అచ్యుతాపురంలో అందజేశారు. కొంతకాలంగా అప్పికొండ నాయుడు కుమారుడు అనారోగ్యానికి గురయ్యారు. అతని ఆర్థిక పరిస్థితి, ఆరోగ్య పరిస్థితి బాగో లేకపోవడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.10 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజాన రమేష్ కుమార్, పి తులసి రాము, మామిడి శివ అప్పారావు, కాండ్రేగుల సూర్యనారాయణ, దేశం శెట్టి వెంకటరమణ, బొండా జగన్నాథం దూళి రంగనాయకులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి-కె.కోటపాడు : జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలతో మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు శుక్రవారం వన సమారాధన నిర్వహించారు. మండలంలోని దాలివలసలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల పరిషత్, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొని ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. వివిధ రకాల ఆటలు పాటలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

.వికలాంగ విద్యార్థులకు నిత్యావసరాల వితరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని వికలాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా కుర్మన్నపాలెం ప్లాస్ ప్లే స్కూల్ వ్యవస్థాపకులు డి.సంధ్యారాణి రూ.50 వేలు విలువచేసే నిత్యవసర సరుకులను నిర్వాహకులు పివిస్తి పట్నాయక్‌కు శుక్రవారం అందజేశారు.



సంబరాల్లో పాల్గొన్న సినిమా హీరో పల్లా నాగార్జున

'రోలుగుంట సూరి' సినిమా సంబరాలు

ప్రజాశక్తి-సబ్బవరం : తపస్వి ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై పల్లా చాందిని నిర్మాతగా, అనిల్ కుమార్ పల్లా డైరెక్టర్‌గా నిర్మించిన 'రోలుగుంట సూరి' సినిమా శుక్రవారం రిలీజ్ సందర్భంగా స్థానిక ఎస్‌టిబిఎల్ సినిమా థియేటర్ ఎదురుగా అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు చిన గొల్లలపాలెం గ్రామానికి చెందిన నాగార్జున పల్లా సినిమా హీరోగా, లోకల్ ఆర్టిస్టులు నటించడంతో ఆ గ్రామానికి చెందిన ప్రజలు శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అక్కడ నుండి ఎస్‌టిబిఎల్ థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భరణికాన సాయినాథరావు, రోమాల చంద్రశేఖర్, పల్లా తాతారావు, ఆరిపాక ప్రసాదరావు, పల్లా రమణ, పల్లా సత్యనారాయణ, ఫైటింగ్ మాస్టర్ కోన సంతోష్ కుమార్, వేటూరి గంగరాజు, సంజీవ్ పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కోటవురట్ల : మధుమేహం వ్యాధిగ్రస్తులు సంఖ్య నానాటికి పెరుగుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ మధుమేహం వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని డిఎంహెచ్వో డాక్టర్ వీర జ్యోతి అన్నారు. మండలంలోని రత్నాల పాలెం గ్రామం వద్ద శుక్రవారం ఆమె వ్యాధి నివారణకు పలు సూచనలు సలహాలు అందజేశారు. క్రమం తప్పకుండా ఏదో ఒక వ్యాయామం చేయాలని, కూరగాయలు పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, ఎంపీహెచ్వో బుల్లిబాబు, హెచ్‌వి జయమ్మ, బన్నయ్య పాల్గొన్నారు.

వినాయక ఆలయానికి స్టీల్ గేట్లు

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండల కేంద్రంలోని శ్రీవరసిద్ధి వినాయక ఆలయానికి స్టెయిల్ గేట్లు అమర్చినట్టు టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు కొమ్మిరెడ్డి నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఉదయం కొమిరెడ్డి నాగేశ్వరరావు, కాంతం వారి కుమారుడు కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు కొమ్మిరెడ్డి నాగలక్ష్మి సహకారంతో ఆలయంనకు సుమారు రూ.16వేలు స్టెయిల్ గేట్లు అందించారు.

పలు గ్రామాల్లో డిపిఒ పర్యటన

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని పెనుగోళ్ళు, చిన గుమ్ములూరు గ్రామాల్లో డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్ఎస్ఎస్ఎన్.మూర్తి శుక్రవారం పర్యటించారు. స్వామిత్వ సర్వే రికార్డులను పరిశీలన చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటి కొలతలను శాస్త్రీయ పద్ధతులతో కొలిచి ఇంటికి సంబంధించిన వివరాలను ఇంటి యజమాని పేరుతో హక్కు పత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు సాయి లక్ష్మీ, నాగప్రభు పాల్గొన్నారు.

రొయ్యల ఫ్యాక్టరీల్లో న్యాయ అవగాహనా సదస్సులు

ప్రజాశక్తి, యలమంచిలి టౌన్ : యలమంచిలి ఎంఎల్ఎస్ఎ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జి.స్పందన ఆదేశాల మేరకు శుక్రవారం యలమంచిలి కోర్ట్ ప్యానెల్ లాయర్ టి.నూకరాజు, యస్.రాయవరం తహసీల్దార్ రమేష్‌బాబుతో కలిసి యస్.రాయవరం మండలం, పి.ధర్మవరం, జంగుళూరు, వెలంపాలెం గ్రామాల్లో ఉన్న రొయ్యల ఫ్యాక్టరీలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పిల్లలను పనికి పంపడం, పనికి తీసుకోవడం రెండు చట్టరీత్యా నేరం కార్మికులు, యజమానులకు తెలియజేశారు. కార్యక్రమంలో యలమంచిలి కోర్ట్ పారా లీగల్ వాలంటీర్లు చిరంజీవి, ప్రసాద్, కుమారి, రాజేష్, రాజు, శివ, లక్ష్మి, రత్నం, వెంకట లక్ష్మి, శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోర్టు ప్యానల్ లాయర్ నూకరాజు



ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు

ప్రజాశక్తి -నర్సీపట్నం:డ్రగ్ రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు, రూరల్ సీఐ గోవిందరావు కోరారు. డ్రగ్స్ నిర్మూలన పై అవగాహనకు నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీకి ఆయన స్వాగతం పలికారు, ఈ సందర్భంలో ప్రధాన కూడలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారం నిర్వహించారు. మత్తు పదార్థాల వాడకంతో కలిగే అనర్థాలపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రేవతమ్మ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలి

ఆర్‌డిఒ, తహశీల్దార్‌లకు వివాహితుల వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా చేపట్టిన భూసేకరణలో నివాస గృహాలు కోల్పోయిన కుటుంబాల్లో వివాహమైన ఆడపిల్లలకు ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని వివాహితులు డిమాండ్ చేశారు. మండలంలో అమలాపురం పంచాయతీ మూలపర్ర గ్రామానికి చెందిన పలువురు వివాహితులు శుక్రవారం తహసిల్దార్ కార్యాలయంలో ఆర్డిఓ, ఆర్ అండ్ ఆర్ అధికారి వివి రమణ, తహసిల్దారు నరసింహమూర్తిలను కలిసి ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. భూసేకరణ చేపట్టిన సందర్భంలో ఆనాటి అధికారులు గ్రామసభలు నిర్వహించి ఆర్ఆర్ ప్యాకేజీ వివాహమైన ఆడపిల్లలు కూడా వర్తింప చేస్తామని హామీ ఇచ్చారని, నేడు ప్యాకేజీ జాబితాలో వివాహమైన ఆడపిల్లల పేర్లు నమోదు చేయలేదన్నారు. ఇది చాలా



మాట్లాడుతున్న వివాహితులు

అన్యాయమని, వివాహమైన ఆడపిల్లలకు కూడా ప్యాకేజీ చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆర్‌డిఓ వివి రమణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివాహితులు దుర్గ, అశ్విని దుర్గ, వరలక్ష్మి, నాగ చక్ర, మంగాదేవి, మణిరాజు కుమారి, రేవతి, లలిత, పార్వతి, నాగమణి, గురు లక్ష్మి, రాణి, శాంతి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డైరీలను అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

అంకితభావంతో పని చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-నక్కపల్లి:అంకితభావంతో పనిచేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తేవాలని యుటిఎఫ్ యూనియన్ నాయకులు కోరారు. ఇటీవల డిఎస్‌సి ద్వారా ఎంపికై మండలంలో డిఎల్ పురం, చినదొడ్డిగల్లు, గొడిచెర్ల వేంపాడు, జానకయ్య పేట తదితర గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా చేరిన ఉపాధ్యాయులను శుక్రవారం యుటిఎఫ్ యూనియన్ నాయకులు కలిసి అభినందనలు తెలియజేసి, యూనియన్ డైరీ, సిఎల్ బుక్స్ అందజేశారు. నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. యుటిఎఫ్ యూనియన్ నాయకులు చేసిన పోరాట ఫలితంగానే జీతభత్యాలు, సెలవులు, ఇతర సౌకర్యాలు దక్కాయని, ఉపాధ్యాయులంతా పాఠశాల విధుల్లో చురుగ్గా ఉంటూనే సంఘ కార్యకలాపాల్లో కూడా పాల్గొనాలని కోరారు. సభ్యత్వాలు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పంపనబోయిన వెంకట్రావు, నక్కపల్లి మండల అధ్యక్షులు డిఆర్‌కే శాస్త్రి, ప్రధాన కార్యదర్శి గారా రాజబాబు, జిల్లా కార్యదర్శి కాళింగ సతీష్, జిల్లా కౌన్సిలర్ ఎమ్.జయనాయక్, కార్యదర్శి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వైసిపి మండల కమిటీల ఎన్నిక



గోపిశెట్టిని అభినందిస్తున్న దొండా రాంబాబు

వైసిపి రైతు విభాగం మండల అధ్యక్షునిగా గోపిశెట్టి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనును వైసిపి రైతు విభాగం మండల అధ్యక్షులుగా పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయనను జడ్పిటిసి దొండ రాంబాబు శుక్రవారం శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు.

పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షునిగా శ్రీను



మండల పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షునిగా చింతపాక సర్పంచ్ గొలజాన శ్రీనును, మీడియా సెల్ అధ్యక్షునిగా ముచ్చక్కర్ల వెంకట్రావును, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా గుడాల ఆనందను నియమించారు. వీరిని మండల నాయకులు అభినందించారు.

ఐటి విభాగం అధ్యక్షులుగా వెంకట్



బుచ్చయ్యపేట:మండలంలోని మంగళాపురం సర్పంచ్ కంటే వెంకట్‌ను ఐటి విభాగం అధ్యక్షులు (డిజిటల్ మేనేజర్)గా నియమించారు. వెంకట్‌ను పలువురు నేతలు అభినందించారు.

రోలుగుంట మండల అధ్యక్షులుగా రమణ



రోలుగుంట: వైసీపీ సీనియర్ నాయకులు తమరాన వెంకటరమణ(టీవి.రమణ) వైసీపీ మండల అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ మేరకు మండల నాయకులు పలువురు హర్షం వ్యక్తం చేశారు. రమణ మండల సీనియర్ నాయకుడుగా, గతంలో రెండు సార్లు ఇదే పదవిని పొందారు. తనను ఎన్నికోవడంపై వైసీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గుడివాడ అమర్నాథ్, మండల నాయకులు, ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు యర్రంశెట్టి రాజారావు(బాబులు), జెడ్పీటీసీ పోతల వెంకట రమణమ్మ, మాజీ ఎంపిపి శెట్టి సత్యనారాయణమూర్తి, పోతల రాజశేఖర్, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకట్రావు, మడ్డు శ్రీను(చంటి) తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో రమణ బిసి కార్పొరేషన్ డైరెక్టర్‌గానూ, జానకిరామపురం సర్పంచ్‌గా పని చేశారు.ఆయను పలువురు అభినందించారు.

ఘనంగా బాలల దినోత్సవం



చీడికాడలో నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-చీడికాడ: మండలంలోని బీసీ కాలనీలో మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గణపతి మాస్టర్ మాట్లాడుతూ, నెహ్రూకి పిల్లలు అంటే ఎంతో ఇష్టమన్నారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం జవహర్ లాల్ నెహ్రు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అంగన్వాడీలు జవహర్ లాల్ నెహ్రు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడీలు మంగ, విజయలక్ష్మి, రాజేశ్వరి, రాజకుమారి, ధనలక్ష్మి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

గొలుగొండ:జోగుంపేట హైస్కూల్‌లోని దివ్యాంగ విద్యార్థులకు శుక్రవారం వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ప్రత్యేక ఉపాధ్యాయులు మాణిక్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, క్రాఫ్ట్ వర్క్, మ్యూజికల్ ఛైర్, చెస్, రన్నింగ్ వంటి ఆటలు ఆడించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ మురళీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావికమతం: మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి గేమ్స్‌లో గెలుపొందిన విజేతలకు చినపాచిల స్కూల్‌లో ప్రధానో పాధ్యాయులు విజయ శ్రీ ఆధ్వర్యంలో పాఠశాల చైర్మన్ బంటు మణి, వైస్ చైర్మన్ కరణం ఈశ్వరరావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

కశింకోట : కశింకోట డిపిఎన్ హైస్కూల్‌లో బాలల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పిడి కమల పాల్గొన్నారు. శ్రీవివేకానంద స్కూల్‌లో మళ్ల జగదీష్, మళ్ల శైలజ ఆధ్వర్యంలోనూ, సెయింట్ జాన్స్ స్కూల్ డైరెక్టర్ నోబెల్ కుమార్, కరస్పాండెంట్ బి. అనురాధ ఆధ్వర్యాన, రామన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రమేష్‌రావు ఆధ్వర్యాన, తాళ్లపాలెం భార్గవి విద్యా మందిర్‌లో కరస్పాండెంట్ ద్వారపురెడ్డి రవి, హెచ్‌ఎం డి.వరలక్ష్మి ఆధ్వర్యాన, గాయత్రి ప్రైమరీ హైస్కూల్‌లో కరస్పాండెంట్ బి.కుమార్, ప్రిన్సిపాల్ వై.నగేష్ ఆధ్వర్యాన బాలల దినోత్సవం నిర్వహించారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెహ్రూ జయంతి సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపాల్ పి.శిరీషా రాణి, ఎన్‌సిసి అధికారి పిపిసిహెచ్.వరప్రసాద్ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ డే వేడుకలు నిర్వహించారు. గొట్టివాడ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పివి.ఆనంద్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శేషుకుమారి సత్యారావు, ఉప సర్పంచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని దాలివలస, సింగన్న దొరపాలెం, గొల్లలపాలెం అంగన్వాడీ కేంద్రాల్లో జరిగిన బాలల దినోత్సవంలో సిడిపిఓ లలిత కుమారి చిన్నారులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. అంగన్వాడి సూపర్వైజర్ ఎల్బి.సుశీల. ఎస్ అనిత పాల్గొన్నారు.

కోటవురట్ల : స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో హెచ్‌ఎం శ్రీనివాసమూర్తి, మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం సత్యాడ సుకుమార్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు.

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన బాలల దినోత్సవంలో ఎంఇఒ సిహెచ్ఉమా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలతో నివాళులర్పించారు. బేతపూడి కేజీబీవీలో పాఠశాల ఎస్ఓ సిహెచ్ భువన మాధురి, తెనుగుపూడి అంబేద్కర్ గురుకులంలో విక్టర్ పాల్ ఆధ్వర్యంలో వేడుకులు జరిగాయి.

యస్.రాయవరం : మండలంలోని ధర్మవరం అగ్రహారం పాఠశాలలో హెచ్‌ఎం ప్రశాంతి ఆధ్వర్యాన నెహ్రూ చిత్రపటానికి పూలమాలతో నివాళుర్పించారు. ఉపాధ్యాయులు లలితాంబ, భవాని, శ్రీను పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : స్థానిక కొత్తపేట జెడ్‌పి హైస్కూల్‌లో హెచ్‌ఎం వైవి రమణ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు రాజు, శ్రీనివాసరావు, శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని దేశపాత్రనిపాలెంలో ఐద్వా ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వడ్డాది శ్యాం ప్రసాద్, జోష్నా, మోహన, మౌనిష, హైమా, హర్ష, హాసిని, శ్యామ్, రోహిత్ పాల్గొన్నారు.

పెందుర్తి: గోపాలపట్నం దరి ఆర్ఆర్‌వి పురం అల్వార్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో బాలల దినోత్సవం సందర్భంగా. చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు, చాచా నెహ్రూ గురించి హెచ్‌ఎం విజయకుమార్ వివరించారు. పాఠశాల డైరెక్టర్ హర్షిత, చిరంజీవి, క్యాంపస్ కోఆర్డినేటర్ భగవాన్ పాల్గొన్నారు

ఆనందపురం:మండలంలోని వెల్లంకి రవీంద్రభారతి పాఠశాలలో బాలల దినోత్సవాన్ని చిన్నారుల వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా నిర్వహించారు. రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ ఎంఎస్.మణి, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి ఎన్. వెంకటేష్, ప్రిన్సిపాల్ బి. జ్యోతి పాల్గొన్నారు.

గంభీరం ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా విశాఖకు చెందిన రామారావు, స్వాతి దంపతులు విద్యార్థులకు ప్లాంక్‌లు, స్టేషనరీ, స్వీట్స్ అందజేశారు. హెచ్‌ఎం యువివి.ప్రసాద్ పాల్గొన్నారు

ములగాడ : స్థానిక స్వామి వివేకానంద హైస్కూల్‌లో నెహ్రూ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ డి మురళీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డి.రేణుక, ఉపాధ్యాయులు కృష్ణారావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక బాలసదనంలో బాలల దినోత్సవ వేడుకల్లో జిల్లా బాలల సంరక్షణ అధికారి కె హరికృష్ణ,ప్రొటక్షన్ అధికారి చంద్రశేఖర్, బాలసదనం సూపరింటెండెంట్ ఆర్ ఊర్మిళ, మమత, అనిజ పాల్గొన్నారు సిడార్ స్కూల్స్ బాలల దినోత్సవ వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ సెరీన్ వివేక కంటి మహంతి, సునీత కౌమన్, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు

గాజువాక : 72వ వార్డు చినగంట్యాడ ప్రాదమిక పాఠశాలలో బాలల దినోత్సవంలో కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ కేక్ కట్ చేశారు చిన్నారులకు ఫ్రూటీలు, చాక్లెట్లు పంచిపెట్టారు. టిడిపి నాయకులు ఎ.లక్ష్మణరావు, దాసరి విజయసాయి పాల్గొన్నారు.

70వ వార్డు భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపల్ పాలవలస భాస్కర్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు.



ములగాడలో బహుమతులు ఇస్తున్న టీచర్స్

స్కూల్ పిల్లలు వివిధ ఆట పోటీల్లో పాల్గొన్నారు.

తగరపువలస: తాటితూరు జెడ్‌పి హైస్కూల్‌లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు తగరపువలస సుఖీభవ రోడ్‌లోని కిడ్స్ కింగ్‌డమ్ స్కూల్‌లో చిల్డ్రన్స్‌డే వేడుకల్లో చిన్నారుల వేషధారణ, ఆటల పోటీలు అలరించాయి. ప్రిన్సిపాల్ బాలకృష్ణ బాలు విజేతలకు బహుమతులు అందజేశారు. టీచర్ ఎం .చందన పాల్గొన్నారు

తాళ్లవలస జెడ్‌పి హైస్కూల్‌లో బాలల దినోత్సవంలో ఎంఇఒ జయప్రద, హెచ్‌ఎం ఇమంది రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు ఎం.నరసింహ రావు. జె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆరిలోవ: బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా దీనదయాల్‌పురం ప్రభుత్వ బాలుర, ప్రత్యేక పరిశీలన గృహాల్లో బాలల దినోత్సవంలో సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనాయాయణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ రామలక్ష్మీ రాధ, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు వినయ్ గాంధీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు వెంకట లక్ష్మీ, పర్యవేక్షణాధికారి పి.రమణ, సత్యనారాయణ, డాక్టర్ టిజె. జీవన్ పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని ఆర్‌వి.పురం హైస్కూల్, మద్ది, రెడ్డిపల్లి, అనంతవరం తదితర ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవం, నెహ్రూ జయంతి నిర్వహించారు. చాచా నెహ్రూకు నివాళులర్పించారు. వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుముతులు అందజేశారు.

కొవ్వాడ సంస్కృతి స్కూల్‌లో బాలదినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఎం జగదీష్ ఉపాధ్యాయుల కషిని ప్రశంసించారు.


కమిటీ సభ్యుల జాబితాను ఆర్‌డిఒకు ఇస్తున్న మత్స్యకారులు

52 మందితో మత్స్యకారుల కమిటీ

ప్రజాశక్తి-నక్కపల్లి: రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత సూచన మేరకు మత్స్యకారులు 52 మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేసుకుని, నర్సీపట్నం ఆర్డీఓ వివి రమణ, తహసిల్దారు నరసింహమూర్తి లకు అందజేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు ఆందోళన కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ 29న రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత రాజయ్య పేటలో మత్స్యకారులు చేస్తున్న ఆందోళన శిబిరం వద్దకు వచ్చి మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులంతా బల్క్ డ్రగ్ ఏర్పాటును నిలుపుదల చేయాలని డిమాండ్ చేయడంతో హెూం మంత్రి అనిత తన చేతుల్లో లేదని మత్స్యకారులు ఒక కమిటీగా ఏర్పడితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకు వెళ్తానని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు మత్స్యకారులు కమిటీగా ఏర్పడలేదు. నవంబర్ 3వ తేదీన నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో హెూం మంత్రి అనిత గ్రీవెన్స్ నిర్వహించగా, మత్స్యకారులు బల్క్ డ్రగ్ ను రద్దు చేయాలని కోరుతూ మరల మరోసారి వినతిపత్రం అందజేశారు. అప్పుడు కూడా ఆమె కమిటీగా ఏర్పడితే సీఎం వద్దకు తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం 52 మందితో కమిటీ ఏర్పాటు చేసి అధికారులకు అందజేశారు. కమిటీతో కూడిన జాబితాను జిల్లా కలెక్టర్, హెూంమంత్రికి అందజేస్తామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, మత్స్యకార నాయకులు పిక్కి తాతీలు, గోసల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మెడకు ఉరితాళ్లతో..మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి ప్రాణాలైనా ఇస్తాం కానీ... బల్క్ డ్రగ్ ను కట్టనివ్వమని మత్స్యకారులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు శుక్రవారం నాటికి 62 వ రోజుకు చేరింది. ఆందోళన శిబిరం వద్ద మత్స్యకారులు బైఠాయించి మెడకు ఉరితాడులు బిగించుకొని వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టొద్దని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటును నిరసిస్తూ 62 రోజుల నుండి శాంతియుతంగా రిలే దీక్షలు చేస్తుంటే ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. సముద్రాన్ని దూరం చేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తమ జీవన విధానాన్ని, మనోభావాలను ప్రభుత్వ అర్థం చేసుకుని బల్క్ డ్రగ్ ను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం మొండిగా బల్క్ డ్రగ్ ఏర్పాటు చేయాలని చూస్తే ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, మత్స్యకార నాయకులు పిక్కి తాతీలు, మైలపల్లి మహేష్ బాబు, గోసల సోమేశ్వరరావు, చేపల సోమేష్, యజ్జల అప్పలరాజు, పి కాశీరావు, బి.నూకమ్మ, బి.చిన్నతల్లి వై.కొర్లయమ్మ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

ఘనంగా నరెడ్కో ప్రాపర్టీ ఫెస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: నరెడ్కో ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు బీచ్ రోడ్‌లోని గాదిరాజు ప్యాలెస్‌లో తలపెట్టిన ప్రాపర్టీ ఫెస్ట్ - 2025ను శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ చంద్రబాబు కృషితో పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చి రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నారన్నారు. పారిశ్రామికంగానే కాక టూరిజం ద్వారా అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయన్నారు. అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని వచ్చిన కంపెనీలు కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని తెలిపారు. వాటిని తిరిగి రప్పించడంతో పాటు కొత్త పెట్టుబడులకు నిలయంగా మార్చామని పేర్కొన్నారు.


నరెడ్కో ప్రాపర్టీ ఫెస్ట్ ప్రారంభ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి సత్యప్రసాద్ తదితరులు

ఇదంతా చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో సాధ్యమైందని తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, అందుకు అనుగుణంగా ఎన్నో జిఒలు తీసుకు వచ్చామని తెలిపారు. విశాఖలో ఐదు లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు. నరెడ్కో ప్రతినిధులు తమను అనేకసార్లు కలసి ఇబ్బందులు చెప్పారని, జిఒలు సరిచేయడంలో వారితో చర్చించిన తర్వాతే నిర్ణయం చేసామని తెలిపారు. నరెడ్కో జాతీయ అధ్యక్షులు హరిబాబు మాట్లాడుతూ నరెడ్కో ఆధ్వర్యంలో ఇటువంటి ప్రోపర్టీ షోలు భవిష్యత్‌లో దేశమంతా నిర్వహించే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల నుండి జాతీయ అధ్యక్షులుగా తాను మొట్టమొదటి సారిగా ఎన్నికయ్యానని తెలిపారు. నరెడ్కో రాష్ట్ర అధ్యక్షులు గద్దే చక్రధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎన్నో జిఒలు రియల్‌ఎస్టేట్ అభివృద్ధికి తీసుకురాగలిగామన్నారు. గూగుల్, మిట్టల్ స్టీల్, టిసిఎస్, రిన్యూ ఎనర్జీ వంటి సంస్థల రాకతో నగరం పెట్టుబడుల గమ్యస్థానంగా మారిందన్నారు. ప్రాపర్టీషో ద్వారా కొనుగోలు చేసి ప్రత్యేక రాయితీలతో పాటు లబ్ధిపొందాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, గౌతు శిరీష, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్ భరత్, నరెడ్కో ఉత్తరాంధ్ర అధ్యక్షులు రమేష్ బాబు, విశాఖ అధ్యక్షులు రాజశేఖర్, ప్రతినిధులు సుబ్బారావు, వెంకన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సిఐఐ సదస్సు దృశ్య మాలిక


ఎపి పెవిలియన్‌లోని భవనాల నమూనాను పరిశీలిస్తున్న కళాకారులు


ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు


స్టాల్‌లోని చేనేత మగ్గంపై బట్టలునేస్తున్న రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి


వాహనంలో ప్రాంగణానికి వస్తున్న అతిథి


చర్చల్లో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు


థింసా నృత్యం చేస్తున్న గిరిజన కళాకారులు


విదేశీ ప్రతినిధిని తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది


తప్పెట గుళ్లు ఆడుతున్న కళాకారులు